ముమ్మరంగా కాలువ పనులు



జేసీబీతో చేపడుతున్న కాలువ పనులు

- పూడికతీత, ప్రాజెక్టు నిర్వహణకు నిధులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు

తాంసి: మండలంలోని రైతులకు మత్తడివాగు ప్రాజెక్టు ద్వారా అధికంగా సాగునీరు అందుతుంది. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఎడమ కాలువ మాత్రమే నిర్మించారు. ఈ కాలువ ద్వారా ఆయకట్టు కింద ఉన్న వివిధ గ్రామాలకు ప్రతీ ఏటా సాగు నీరు అందుతుంది. కాలువలో పిచ్చిమొక్కలు, తుంగగడ్డి ఏపుగా పెరుగడంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందడం లేదు. మూడేళ్ల క్రితం ప్రధాన ఎడమ కాలువ పూడికతీత తీశారు. గత మూడేళ్లుగా పూడికతీత పనులు చేపట్టకపోవడంతో అధ్వానంగా మారింది. దీంతో పూడికతీత పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి, పనులు చేపట్టారు. గడ్డిని తొలగించడంతో పాటు కాలువ మరమ్మతు పనులు ముమ్మరంగా చేపడుతున్నారు.

రూ.41 లక్షల నిధులు..

ప్రధాన ఎడమ కాలువ పూడికతీతతో పాటు ప్రాజెక్టు మరమ్మతులకు రూ.41 లక్షలను అధికారులు మంజూరు చేశారు. కాగా.. ప్రాజెక్టు ఎడమ కాలువ పూడికతీత, పిచ్చి మొక్కల తొలగింపుకు రూ.19.96 లక్షలు, ఆనకట్టపై పెరిగిన చెట్ల తొలగింపుకు రూ.10 లక్షలు, ప్రాజెక్టు నిర్వహణకు రూ.11.80 లక్షలను కేటాయించారు. ప్రస్తుతం రైతులు సాగుచేసిన పంట కాలం ముగియడంతో పాటు ప్రాజెక్టులో సైతం నీరు డెడ్‌స్టోరేజీకి చేరింది. ప్రస్తుతం పనులు సగానికి పైగా పూర్తయ్యాయి.

రైతులకు తప్పనున్న తిప్పలు..

ప్రస్తుతం కాలువ పనులు ముమ్మరంగా సాగుతుండడంతో ఇక రైతులకు తిప్పలు తప్పనున్నాయి. గత మూడేళ్లుగా కాలువలో గడ్డితో పాటు మట్టి పేరుకుపోవడంతో సాగునీరు సరిగ్గా ప్రవహించడం లేదు. ఎడమ కాలువ ద్వారా ఆయకట్టు కింద 8500 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా పూడికతీత పేరుకుపోవడంతో పూర్తిస్థాయిలో నీరు అందక ప్రతీ ఏటా లక్ష్యం చేరడం లేదు. గోట్కూరి, సావర్గాం, జందాపూర్, భోరజ్ గ్రామాల శివారులోని రైతులు ప్రతీ ఏటా నీటి కోసం కాలువ వద్ద నీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. పూడికతీత పనులు చేపట్టడంతో వచ్చే సీజన్ నుంచి సాగునీరు అందుతుందని ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పనులు సాగుతున్నాయి

మత్తడివాగు ప్రాజెక్టు ఎడమ కాలువ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఎడమ కాలువ పూడికతీతతో పాటు ప్రాజెక్టు కట్టపై చెట్ల తొలగింపు, మరమ్మతులు పూర్తి చేశాం. దాదాపుగా 80 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. వర్షాకాలం సీజన్‌కు ముందే పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌లను ఆదేశించాం. చివరి ఆయకట్టు రైతుకు సైతం సాగునీరు అందేలా చూస్తాం.

– హరీశ్‌కుమార్, మత్తడివాగు ఏఈ

క్లుప్తంగా

ఏకరూప దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంఈవో

నార్నూర్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్న ఏకరూప దుస్తులను సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏంఈవో పవార్ అనిత, ఐకేపీ ఏపీఎం మైస రమేశ్‌లు విద్యార్థులకు పంపిణీ చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో మొత్తం 68 పాఠశాలలో చదివే విద్యార్థులు బాలురు 1533, బాలికలు 1308 మొత్తం 2841 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులను మహిళ టైలర్స్‌లతో కుటించడం జరిగిందన్నారు. పాఠశాలలు ప్రారంభం అయ్యేలోపు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు సంతోష్, కిషన్, శ్రీరామ్, రాథోడ్ అనసూయ, గంగాపూర్ నాయక్ పాల్గొన్నారు.

అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

ఇచ్చోడ: మండలంలోని కేశవపట్నం గ్రామంలో అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి అర్హులకు విస్మరించారని గ్రామస్తులు సోమవారం అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందచేశారు. గ్రామస్తుడు షాహిద్ మాట్లాడుతూ.. గ్రామంలో 27 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. 27 మంది కూడా అనర్హులేనని ఆరోపించారు. ఇళ్లు ఉన్న వారికి, ధనికులకు ఇళ్లు మంజూరు చేశారని మండిపడ్డారు. పాత జాబితాను రద్దు చేసి రీ సర్వే చేయించి అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అల్తాఫ్, షేక్ మహ్మద్, షేక్ ఫరీద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్

ఇచ్చోడ: భూ సమస్యలు పరిష్కారించేందుకే ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం మండలంలోని గుబ్బ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండల వ్యాప్తంగా రెవెన్యూ గ్రామాల్లో రెండు టీంల ద్వారా సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరిస్తామన్నారు. మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఇంద్రవెల్లి: మండలంలోని దొడంద గ్రామానికి చెందిన తుంర సందూర్‌షావ్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం దొడంద గ్రామానికి సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, ఎండీ జహిర్, పవార్ దూదిరాం, నాగోరావ్, వెంకటి, జితేందర్, బాపురావ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

తాంసి: పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని మండల పంచాయతీ కార్యదర్శులు కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షుడు గంగన్న మాట్లాడుతూ పంచాయతీల నిర్వహణలో భాగంగా ప్రతీ నెల ట్రాక్టర్ డీజీల్, తాగునీరు, విధిదీపాల నిర్వహణ పారిశుద్ధ పనుల నిధులు విడుదల చేయాలని కోరారు. పెండింగ్ చెక్కులు క్లియర్ చేసి పంచాయతీల వారీగా విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కార్తీక్, నరేశ్, హమీద్, సంధ్యారాణి పాల్గొన్నారు.

బైక్ దొంగ అరెస్ట్

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో సోమవారం రాత్రి సీఐ వెంకటేశ్వర్ రావ్, ఎస్సై సంజయ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఇచ్చోడ మండలం కొకస్‌మన్నూర్ గ్రామానికి చెందిన షేఖ్ అబ్బాస్ టీఎస్ 01 ఈకే 3992 హీరో బైక్‌పై అనుమానస్పదంగా కనబడటంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించారు. తన వద్ద ఉన్న బైక్ సంవత్సరం కింద దొంగతనం చేశానని బైక్ నంబర్ మార్చి తిరుగుతున్నానని తెలిపాడు. షేఖ్ అబ్బాస్‌పై కేసు నమోదు చేసి బైక్‌ను సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

నేరడిగొండ: మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌టీ రమణ, ప్రధాన కార్యదర్శి గస్కంటి అమృత్ కుమార్‌లు అన్నారు. సోమవారం ఎంపీడీవో రాజ్‌వీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ కమిటీల్లో అసలైన లబ్ధిదారులకు కాకుండా ఇతరులకు అందించారన్నారు. మరోసారి సభ ఏర్పాటు చేసి అర్హులను గుర్తించాలన్నారు.

‘రైతుభరోసా’ విడుదల చేయాలి



ఆందోళన చేస్తున్న రైతులు

తలమడుగు: ప్రభుత్వం రైతు భరోసా వెంటనే విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని రైతులు అంబేడ్కర్ విగ్రహం వద్ద సామూహికంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం కన్నా ఎక్కువ రైతు భరోసా అందిస్తానని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. మూడు నుంచి నాలుగు ఎకరాల లోపు రైతులకు మాత్రమే రైతు భరోసా ఖాతాలలో జమ అయ్యాయని, మిగతా రైతులకు ఏప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని రైతులకు రైతు భరోసా ఇస్తే విత్తనాలు, ఎరువులు కొనుగోళ్లు చేసుకోనేందుకు, దళారీల చుట్టూ తిరుగుతూ రైతులు అధిక వడ్డీలకు పెట్టుబడి కోసం డబ్బులు తీసుకునే పరిస్థితి నెలకొందన్నారు. ముందస్తు ప్రణాళిక లేకుండా ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. రైతులు వెంకన్న, ఇస్తారి, నర్సారెడ్డి, మహేశ్‌రెడ్డి, భూత దేవన్న, చంటి పాల్గొన్నారు.

సర్దుబాటు పేరిట ఉపాధ్యాయులను పంపించొద్దు



వినతిపత్రం అందజేస్తున్న గాజుల పోతన్న

బోథ్: సొనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయుల్లో ఉన్న కొంత మందిని సర్దుబాటు పేరిట ఇతర ప్రాంతాలకు పంపించొద్దని స్థానిక నాయకుడు గాజుల పోతన్న జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం 518 మంది విద్యార్థులు పాఠశాలలో చదువుతున్నారని, సంఖ్యను ఈ విద్యా సంవత్సరం 550కి చేరుతుందన్నారు. ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు.

‘ఆపరేషన్ కగార్’ ఆపాలి



అడెల్లు భౌతికకాయనికి నివాళులర్పిస్తున్న సుగుణ

బోథ్: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపివేయాలని కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ డిమాండ్ చేశారు. సోమవారం బోథ్ మండలంలోని పాచ్పెర గ్రామంలో నిర్వహించిన మావోయిస్ట్ మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాంతి చర్చలు జరపాలని మావోయిస్టులు కోరుతున్నా.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా మావోయిస్టులను చంపడం దుర్మార్గమైన చర్యని మండిపడ్డారు.

మాగంటి గోపినాథ్ మృతి పార్టీకి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అకాల మృతి పార్టీకి తీరనిలోటని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో సంతాపసభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆత్మకు శాంతి చేకూర్చాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. 1982లో టీడీపీలో రాజకీయ ప్రస్తానం ప్రారంభించారని తెలిపారు. హుడా డైరెక్టర్‌గా సేవలు అందించారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీడీపీని వదిలి బీఆర్ఎస్‌లో చేరారని, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అజయ్, మనోహర్, సాజిదొద్దీన్, యూనుస్ అక్బాని, మెట్టు ప్రహ్లాద్, రమేశ్, కుమ్ర రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు ఇచ్చోడలో రెవెన్యూ సదస్సు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోని రైతు వేదికలో మంగళవారం ఉదయం 9 గంటలకు భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ రావు తెలిపారు. ఇచ్చోడ పరిధిలోని రైతులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం రైతువేదికలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

సన్మానం

ఇచ్చోడ: మహా భారతాన్ని గోండి భాషాలోకి అనువదించిన కోడిసం కైలాస్‌ను సోమవారం మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో శాలువాతో సన్మానించారు. ఆధ్యాత్మిక భజన మండలి గౌరవ అధ్యక్షుడు బ్రహ్మానందం రెడ్డి మాట్లాడుతూ.. మహా భారతాన్ని గోండి భాషాలో అనువధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సార్‌మేడి అమృత్‌రావు, ఆధ్యాత్మిక ప్రవచాకులు కేశవ్‌రావు, బబ్రువాన్ మహారాజ్ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించాలి

కైలాస్‌నగర్: తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని శానిటరి ఇన్‌స్పెక్టర్ బైరి శంకర్ అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం పట్టణంలోని మహిళ సంఘాలకు తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. భుక్తాపూర్ కాలనీలో ఇంటింటికి వెళ్లి మహిళలను చైతన్యపర్చారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ అవి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

బిర్సాముండా వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

బోథ్: ఆదివాసీ పోరాటయోధుడు బిర్సాముండా వర్ధంతిని సొనాల మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా మాతృదేశం స్వతంత్రం కోసం పోరాడిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో మెస్రం భూమన్న, లాలూ రామ్, రమేశ్, గాజుల పోతన్న, సుభాష్ సూర్య, విద్యాసాగర్, అమృత రావు, మహమూద్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

నార్నూర్: ఆదివాసీ పోరాటయోధుడు బిర్సాముండా 125 వర్ధంతిని సోమవారం మండల కేంద్రంలో ని కుమురం భీం భవన్‌లో ఆదివాసీ సంఘాల నా యకులు ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల కోసం పోరాటం చేయడంతో పాటు వారి అభివృద్ధి కోసం ఎంతో కృషి చే శారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పాలకమండలి డైరెక్టర్ మాడవి మాన్కు, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, మెస్రం మా ణిక్ రావు, మడవి ఆనందరావు పాల్గొన్నారు.

ఘనంగా లింగాష్టక పారాయణం



లింగాష్టక పారాయణం చేస్తున్న భక్తులు

బోథ్: సొనాల గ్రామంలోని శ్రీరాజరాజేశ్వర మందిరంలో సోమవారం సామూహిక లింగాష్టక పారా యణం నిర్వహించారు. ఉదయం 7:30 గంటలకు లింగాష్టక పారాయణంలో భక్తులు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. మొత్తం 21 వారాల పాటు సా మూహిక లింగాష్టక పారాయణం కొనసాగుతుందని భక్తులు తెలిపారు. కాగా ఈ సోమవారం 15వ వారానికి చేరుకుందన్నారు. అనంతరం అడప సుజాత, శంకర్ దంపతులు, మిరాదర్ అనూరాధ సచిన్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఇంద్రవెల్లి: చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు అనిల్ రాథోడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల–2లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బుద్ధనగర్‌లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుద్దోధన్ కాంబ్లే, పవార్ శాంతికుమార్, మున్మురే అంబాజీ, పాండ్రే నారాయణ్, ఆడే రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్



ప్రొసీడింగ్ అందజేస్తున్న ఏపీవో శ్రీనివాస్

ఇచ్చోడ: మండలంలోని మాదపూర్, హీరాపూర్ గ్రామాల్లో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీవో లక్ష్మణ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లు లేని వారిని గుర్తించి ప్రభుత్వం ఇందిరమ్మ ఇ ల్లు మంజూరు చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందచేస్తున్నట్లు పేర్కొన్నా రు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షాదుల్ల, ఉప్పులేటి రాజేశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలోని మోర్కండి గ్రామంలో 12 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏపీవో శ్రీనివాస్ సోమవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. వర్షాకాలం తొలకరి వర్షాలకంటే ముందే పునాది వరకు పనులు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యకరమంలో కానిందే దినేష్, నగేశ్, దేవిదాస్, లక్ష్మి పాల్గొన్నారు.

బోథ్: బోథ్ పట్టణంలో సోమవారం మంజూరుపత్రాలు అందుకున్న లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లకు బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు భూమిపూజ చేశారు. లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో పేద ప్రజలకు ఇండ్లు లభించలేదన్నారు. కార్యక్రమంలో గొర్ల రాజు, శేక్ రజియా బేగం, శేఖర్, అబ్రార్, కురుమే మహేందర్, షేక్ షాకీర్, మెరుగు భోజన్న, షేక్ మొహమ్మద్, కంగుల రాజన్న, లబ్ధిదారులు అక్కమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న పోరెడ్డి శ్రీనివాస్



సమావేశమైన బీజేపీ నాయకులు

బజార్‌హత్నూర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ మండల సంకల్ప సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ మన దేశాన్ని ప్రపంచ పటంలో ముందువరసలో ఉంచారని, ఆర్థికంగా, సామాజికంగా, ప్రజాస్వామ్యయుతంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మేకల వెంకన్న, అల్కే గణేష్, నానం రమణ, కొత్త శంకర్, చట్ల సుఖ్‌దేవ్, చట్ల ఉత్తం, వినాయక్ పాల్గొన్నారు.

బోథ్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలని బోథ్ మండల ఇన్‌చార్జి తాటిపెళ్లి రాజు, మాజీ రైల్వేబోర్డు సభ్యులు జీ.వి. రమణ అన్నారు. సోమవారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన, ఉపాధిహామీ పథకం ద్వారా లబ్ధిపొందుతున్న లబ్ధిదారులకు పథకాల గురించి వివరించాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో ప్రతీ గ్రామం నుంచి జెడ్పీటీసీగా, ఎంపీటీసీగా, సర్పంచ్, వార్డ్ మెంబర్లుగా, డైరెక్టర్లుగా, సునాయాసంగా గెలుపొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోరే రవీందర్, బోథ్ పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

జొన్నల డబ్బులు జమ చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామన్న

కైలాస్‌నగర్: జొన్నలు విక్రయించిన రైతులకు వెంటనే వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న కోరారు. ఈమేరకు అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి సోమవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో రైతుల నుంచి జొన్నలు కొనుగోలు చేసిన ప్రభుత్వం ఇప్పటి వరకు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయన వెంట మాజీ మార్కెట్ చైర్మన్ ప్రహ్లాద్, నాయకులు గణేశ్, రాజు, సతీశ్, దమ్మపాల్ తదితరులున్నారు.

పంటమార్పిడి పద్ధతి పాటించాలి



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త మోహన్‌దాస్

తాంసి: రైతులు ఒకే రకమైన పంటలు కాకుండా పంట మార్పిడి పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డి. మోహన్‌దాస్ కోరారు. సోమవారం మండలంలోని గోట్కూరి గ్రామంలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు, వికసిత్ కృషి సంకల్ప్ యాత్రలో భాగంగా రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త మోహన్‌దాస్ మాట్లాడుతూ పత్తి, కంది, సోయా పంటలలో యజమాన్య పద్ధతులు, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏవో రవీందర్, ఏఈవో నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిధులు రాకున్నా.. ప్రజలకు సేవ చేస్తున్నాం



వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

నేరడిగొండ: గత 16 నెలలుగా గ్రామ పంచాయతీలకు పాలక వర్గాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోయినా.. ప్రజలకు సేవ చేస్తున్నామని మండల పంచాయతీ కార్యదర్శులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ అన్నిశాఖల పనులు తమకే అప్పజెబుతున్నారని, గ్రామ పంచాయతీలకు నిధులు రాకపోవడంతో పనులు చేయడంలో ఇబ్బంది పడుతున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఆదిలాబాద్‌టౌన్: మంచిర్యాల జిల్లాకు చెందిన సూరం రాజేశ్వరి (50) ఇటీవల అనారోగ్యంతో రిమ్స్ ఆస్పత్రిలో చేరి, సోమవారం మృతి చెందింది. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు బంధువులు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో మానసేవే మాధవ సేవ సమితి సభ్యులు, బెస్ట్‌ఫ్రెండ్ సొసైటీ ముందుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శశికళ, దేవిదాస్, శ్రావణ్ నాయక్, అజీజ్, సరిత, ఉమా, సాయినాథ్ పాల్గొన్నారు.